# పనివాళ్ళు

"చవకగా వచ్చిందని లంకంత యిల్లు అద్దెకు తీసుకున్నారు. ఈ దొడ్డి నేను చిమ్మి నీళ్ళు చల్లలేను" అన్నది మా ఆవిడ.

"ఇంకేం ఇంటి అద్దెలో కలిసి వచ్చినది పనిమనిషికింద ఖర్చు పెట్టు. నే కాదన్నానా?" అని అన్నాను.

"పనిమనిషికి అంతకూడా అవసరంలేదు లెండి. రెండు రూపాయలు నెలకు."

"అంతకూడా అంటే?"

"మీరంటిరిగా? అద్దెలో ఆదా చేస్తున్నంత."

"అద్దెలో ఎంత ఆదా చేస్తున్నావేం?"

"అయిదు రూపాయలన్నా చేస్తున్నాం. ఈ ఇంటికి పదిరూపాయలియ్య వచ్చును."

"చాలా తెలివి అయిందానవు!"

"న్యాయం లేకపోతే సరి. అయిదు రూపాయల కింత ఇల్లు ఇవ్వటం ఏమిటి. మన ముష్టికొంప ఎనిమిది రూపాయల కివ్వటంలే?"

"పొరుగింటి పుల్లకూర రుచిట!"

"ఇప్పుడు మనకీ ఘర్షణ దేనికికాని, పనిమనిషిని రేపటినించీ రమ్మనమన్నాను. ఏం?"

"రమ్మనమన్నాక ఇంకా నా అనుమతి ఎందుకు?"

"సరే ననటానికి ఎంత మెలిపెడతారండీ!"

"చివరి మాట నీది కాకుండా పోనివ్వవు మొత్తానికి!"

"మీరు పోనిచ్చే వారైనట్టు, పాపం!"

ఆ రాత్రి దీక్షపట్టి చదువుతూన్న నవలను ఒంటిగంట ఆ చాయల పూర్తి చేశాను. ఏం జరిగిందంటే ఆ గ్రంథరాజం ఒక స్నేహితుడి సొత్తు. నెలరోజుల క్రితం దాన్ని అతని దగ్గిర్నించి 'ఇవ్వనో' అంటుంటే బలాత్కారంగా లాక్కొచ్చాను, వారం రోజుల్లో ఇచ్చేస్తానని వాగ్దత్తం చేసి. కారణాంతరాల వల్ల అట్లా జరక్కపోవటమూ నా స్నేహితుడు నన్ను గురించి (వెధవ ముప్పావలా పుస్తకం కోసరం!) అపోహలు పోవటమూ కలిగి, నేను తప్పనిసరిగా దీక్షపట్టవలసి వచ్చింది.

నేనిట్లా కన్ను మూశానో లేదో (నా ప్రాణానికి అట్లా అనిపించింది.) మా వాకిలి తలుపు ఎవరో దౌర్జన్యంగా తట్టటం మొదలుపెట్టారు. నేను మండిపడుతూ లేచి వెళ్ళి వీథి వాకిలి తెరిచాను. చీకట్లో ఎవరో నుంచుని ఉన్నట్టుంది.

"ఎవరు వారు?" అన్నాను.

"నేను పని చేసేదానినయ్యా!" అంది అమిత వినయంగా.

"ఇదుగో, అమ్మీ! నువ్విట్లా ప్రతిరోజూ అర్ధరాత్రివేళ వస్తే మాకు కుదరదు" అని ఖండితంగా చెప్పాను.

"ఇప్పుడర్ధరేత్తి రేంటి నాయనా, తెల్లారిపోతేనూ!" అంది పనిమనిషి.

"నీకు తెల్లవారిందేమో, నాకింకా నాలుగు గంటల రాత్రి అట్టే ఉంది."

"నేను నాలుగిళ్ళలో చేసుకు బతికే ముండను, నాయనగారూ."

"అయితే మిగతా మూడిళ్ళలో చేసుకుని మరీ మా యింటికిరా!"

"ఆళ్ళంతా ఈయాలకి లెగుస్తారా?"

"అయితే నేనేనా లెగిసేది; వల్లకాదు, పో, వెళ్ళు, ఎనిమిది తొమ్మిది ఆ ఛాయలరా."

"ఇయాళకు వచ్చానుగా, అయ్యా!"

"అయితే ఏడు!" అని నేను లోపలే అనుకుని మళ్ళీ వచ్చి పడుకున్నాను. ఇట్లా నడుం వాల్చానో లేదో,

"అయ్యా!"

"ఏం?"

"చీపురిస్తారూ?"

నాకు మండిపోయింది.

చీపురెక్కడుందో నాకేం తెలుసు? తెలిసిన భార్య ఈ కష్ట సమయంలో నన్నాదుకోవటానికి బదులు పుస్తక మల్లే పడుకుని నిద్రపోతున్నది తన పక్కమీద.

"మరెట్లాగయ్యా!"

ఇంకా ఎట్లాగేముందీ? దీపం పెద్దదిచేసి పట్టుకుని "చీపురా, ఎక్కడున్నావే?" అంటూ ఇల్లంతా దొడ్డంతా తిరిగాను! చీపురుకట్ట దొరికింది. బతుకు జీవుడా అని వచ్చి మళ్ళీ పక్కలో పడ్డాను.

"అయ్యా!"

"ఏం?"

"మళ్ళీ లేవటం ఎందుకు? ఇప్పుడే బిందా, చెంబు ఇప్పించండి, నాయనా."

తప్పేదేముందీ? లాంతరు పట్టుకుని వంటింట్లోకి పోతే బిందె అయితే కనపడ్డదిగాని

దాన్నిండా నీళ్ళున్నై. ఆ నీళ్ళతో సహా బిందె ఇవ్వటం అధర్మమనిపించింది. అందుకని ఆ నీళ్ళుపట్టినన్ని బొక్కెనలోనూ మిగిలినవి వంట ఇంట్లో కనపడ్డ చెంబులన్నిటిలోనూ వీలయినంత వరకు పోసి ఇంకా మిగిలిన వాటిని తూము దగ్గిర పారబోసి బిందా చెంబూ పనిమనిషి మొహాన పారేసి వచ్చిపడుకున్నాను.

ఒక్క కునుకైనా సరీగా తీశానో లేదో "అయ్యా!" అంటూ పనిమనిషి తయారు!

"ఏం?"

"బాయి దగ్గిర బొక్కినలేదే!"

"బొక్కెన బావి దగ్గిర ఎందుకుంటుందీ? వంట ఇంట్లో ఉంటే! పైగా దాన్నిండా నీళ్ళుకూడా ఉన్నై! బిందెనీళ్ళివ్వటం భావ్యంకాక పోయినప్పుడు బొక్కెనతో యివ్వటం మాత్రం ఏం భావ్యం? బొక్కెనలో నీళ్ళు కూడా తూము దగ్గిర పారబోసి బొక్కెనకూడా పనిమనిషికిచ్చి పక్కమీద కూచున్నాను. ఇంకేం నిద్రపడుతుందీ? సగం నిద్రలో లేచి బిందెల చప్పుడూ, చెంబుల చప్పుడూ, బొక్కెనల చప్పుడూ నీళ్ళ చప్పుడూ వినటమేకాక, ఆ పదార్థాల శీతలస్పర్శ అనుభవించటమే కాక పైనుంచి కిందికి మరకలు మరకలుగా తడిసిన వాడికి ఏమీ జరగనట్టు నిద్రపట్టమంటే ఎట్లా పడుతుంది?

అట్లాగే నిద్రపోయినాను; అదయినా నిరాటంకంగా జరిగిందా? నా భార్య నామంచం దగ్గిర వచ్చి మీదబడి నవ్వి నాకు నిద్రాభంగం చేసింది. నేను కళ్ళు బలవంతాన తెరిచిచూసి "ఏం వచ్చి పడ్డది?" అని అడిగాను కోపంగా.

"వంటింటి నిండా ఎందుకూ జలకలశాలు పరిచిపెట్టారు?" అంది నా భార్య.

నాకు అందులో నవ్వవలసిన విశేషమేమీ కనపడలేదు.

మా పనిమనిషికి నేను చెప్పిన ముక్క వినపడలేదో అర్థం కాలేదో ఏంగోలో మర్నాడు కూడా అర్ధరాత్రివేళే వచ్చింది. (ఆ మనిషి నడిగితే నాలుగున్నరకు వస్తున్నానంటుంది. నేను నమ్మను!) అదీకాక దొడ్లో ఎక్కడి కసువు అక్కడే ఉండిపోతున్నది. నా భార్య కూడా అంది. కనక పనివేళ మార్చమని పనిమనిషికి మా ఇద్దరి పక్షానా జాయింటు హుకుముజారీ చేశాం.

ఇది జరిగిన మర్నాడు నాకు టంచనుగా ఏడున్నరకు కాఫీ అందలేదు. ఏమిటా అని విచారిస్తే "ఇంకా పనిమనిషి రాలేదు. చెంబులు తోమలేదు" అని తెలియవచ్చింది.

ఇంత ఆలస్యమూ చిక్కుగానే ఉంది. ఆరు-ఆరున్నర చాయల వచ్చేటట్టు పనిమనిషిని చూడమని చెప్పించాను. ఆ తరవాత కొంత అనుకూలంగానే ఉంది.

"ఏమండీ, పనిమనిషికి ఇంకో అర్ధరూపాయి పెంచి దానిచేత బట్టలు కూడా ఉతికించుకుందామండీ!" అంది నా భార్య ఒకనాడు.

"వాడిదుంప తెగిరి! బట్టలన్నీ పిగలగొట్టేస్తున్నాడు. చిన్న చిన్నవి పారేసి వెయ్యనే లేదంటున్నాడు. ఏనీళ్ళలో ముంచుకొస్తున్నాడో ఏమో వెధవ? వాసన వేస్తున్నవి. పైగా వాడు ప్రతిరోజూ రాడాయె!"

"వాడికి పావలేగా ఇస్తున్నది?"

"దీని కింకొక్క పావలేగా? అయినా మనం డబ్బులే ఇవ్వక్కర్లేదు. ఒకపూట అన్నం పెట్టినా ఒప్పుకుంటుంది."

"వోసి పిచ్చిదానా, ఎక్కడి అర్ధరూపాయి, ఎక్కడి పూట అన్నం! మనకు నష్టం కాదూ?"

"ఆఁ! ప్రతిరోజూ మనింట్లో మనిషి అన్నం మిగుల్తూనే ఉంటుంది. నష్టంలేదు."

"సరే, కానీ!"

మొత్తం మీద మా పనిమనిషి చాలా సాధువు. మెల్లిగానూ ఎంతో వినయవిధేయతలుగానూ ఉండేది. ఎప్పుడన్నా బజారికి పొమ్మన్నా, కారం గడ్డలూ కొట్టమన్నా పిళ్ళూ గిళ్ళూ విసరమన్నా సణగకుండా ఒప్పుకునేది.

పనిమనిషి బజారుకు వెళ్ళి ఏవైనా తెస్తే, "సరుకులు తక్కువ వచ్చినట్టుగా ఉన్నయ్యే! ఖరీదు ఎక్కువగా ఉన్నట్టుందే!" అనటం మొదలుపెట్టింది. అంతేకాక క్రమంగా చిన్న చిన్న వస్తువులు పారేసుకునో, ఏమో పనిమనిషిని దబాయించటం కూడా ప్రారంభించింది మా ఆవిడ.

సాటిమనిషిని లోకువచేసి మాట్టాడుతుంటే నా అంతరాత్మ ఊరుకోదు. ఎవరూ నమ్మరుగాని నేను సోషలిస్టును. అంచేత నా భార్య దౌర్జన్యాన్ని కొంచెం అదిమి పట్టుతుండేవాణ్ణి. అందుకు నన్ను నా భార్య రహస్యంగా చివాట్లు పెట్టేది.

"నన్ను మాత్రం అనగలరు! అదేమి చేసినా వూరుకుంటారు? దాన్నేమనరు?"

"ఛా! అది చాలా మంచిది. తిరిగి ఘాటుగా సమాధానం కూడా చెప్పలేదు. దానిమీది కెందుకు ఒంటికాలిమీద పోతావు!"

"మీకు తెలీదు. మీరూరుకోండి!'

ఒకనాడు నేను కాఫీ హోటలుకు బయలుదేరబోతూ పెట్టెలోనించి తీసి చొక్కా తొడుగుకుంటూ ఉండగా మా పనిమనిషి వచ్చి "అయ్యగారూ, గది చిమ్మాలి" అన్నది. నేను ఇవతలికి వచ్చి నా భార్యకు కాఫీ హోటలు నించి ఏమేమి కావాలో బజారు నుంచి ఏమేమి పట్టుకురావాలో కనుక్కుని అలవాటు ప్రకారం జేబు తడువుకుంటే జేబులో ఏమీలేదు. రూపాయితీసి బల్లమీద పెట్టినట్లు జ్ఞాపకం వచ్చింది. పనిమనిషి గదిచిమ్మాలని తొందర చెయ్యటంలో అది తీసి జేబులో వేసుకోకుండా ఇవతలికి వచ్చాను. వెళ్ళి చూస్తే బల్లమీద

రూపాయిలేదు. పెట్టెతీసి పర్సులో చూస్తే అయిదు రూపాయల కాగితం ఉందిగాని విడిరూపాయి లేదు. పనిమనిషే తీసుకుని ఉండాలి. ఇంకెవరు వచ్చారూ?

పనిమనిషి తీసి వుంటుందని ఇంత నమ్మకంగా తెలిపోయినా దాన్ని అడిగేదమ్ములు నాకు లేకపోయింది. మగవాళ్ళం ఎంతపిరికి వాళ్ళమో!

ఆ పాట్ల నేను వెళ్ళి మా ఆవిడతో పనిమనిషి మీద రిపోర్టు చేశాను. ఆ పాట్ల నా భార్య వెళ్ళి పనిమనిషి మీద గ్రైంమని పడ్డది. నుంచున్న పళంగా దాని బట్టవిప్పమంది. చీరకొంగున ముడి కనబడితే అదేమిటని అడిగింది. ఎవరో ఇచ్చిన జీతమని చెప్పింది పనిమనిషి. కావలిస్తే వాళ్ళను అడిగి కనుక్కోమని కూడా అంది. అది సరిగా రూపాయి. ఆ రూపాయి తెచ్చి నా భార్య నాకు చూపించింది. ఆ రూపాయి అచ్చుగా నా రూపాయి మల్లేనే ఉంది. కాని రూపాయిని బోలిన రూపాయి ఉండవచ్చును.

"నువ్వీక్షణం నించీ మా ఉద్యోగం నించి విరమించవచ్చును" అని పనిదానితో ఇద్దరమూ ఏకగ్రీవంగా చెప్పేశాం. దానికి మాత్రం బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇచ్చేసి ఆ రూపాయి మా ఆశీర్వాదాలతోపాటు ఉంచుకోమన్నాము.

ఆడవాళ్ళకు ఎంత అనుభవమూ చాలదు. ఆ సాయంత్రం నా భార్య ఇంకో పనిమనిషిని పెట్టింది. ఈ పనిమనిషి ఇరవై ఏళ్ళలోపుది. చాలా చురుకైనది. పని శుభ్రంగా త్వరగా చేస్తుంది. కాని అమిత కోపధారి. నా భార్యకూ దానికీ మొదటినించీ పడలేదు. కాని దీన్ని గట్టిగా కోప్పడటానికి నా భార్యకు అమిత భయం. మా ఆవిడను బెదరగొట్టుతున్నందుకు పనిదాన్ని చూస్తే నాకు కోపంగానే ఉండేది. కాని దానికేమీ దురుద్దేశాలు లేవని అనుకున్నప్పుడూ దాని పనితనం చూసీ ఏమీ అనబుద్ధి అయ్యేదికాదు.

మా యీ పనిమనిషి ఒక విధమైన సోషలిస్టు. ఒకపూట రాకపోతే "ఎందుకు రాలేదు?" అనకూడదు. దాన్ని మనం యంత్రంగా భావించకూడదు. ఒకపూట రాకపోతే ఏదో తగిన కారణం ఉండే రాలేదనుకోవాలి మేము. ఎప్పుడన్నా ఏదన్నా చెయ్యనన్నా అట్లాగే సర్దుకుపోవాలి. అట్లా కనక సర్దుకుపోగలిగితే అది నిష్కారణంగా గైరుహాజరుకావటం కాని పని తలాయించటం కాని చెయ్యదన్నమాట. మరి నా భార్యకు అంత సోషలిజం అర్థం కాదు. అందుకని నెలకు ఒకపూట రాకపోయినా సణుక్కునేది. (కోప్పడటానికి భయం.) నా మటుకు నాకు దాని సోషలిజంలో ఎక్కడా వెల్తి కనిపించలేదు.

నెలతిరిగి వచ్చింది. పనిమనిషి జీతం అడిగింది. ఎంత ఇవ్వాలన్నాను. రెండున్నర ఇవ్వాలంది. వెనకటి పనిమనిషికి రెండు రూపాయలే ఇచ్చేవాళ్ళమే, నీకింకో అర్ధ ఎక్కువేమన్నాను. తనకు అన్నం పెట్టటంలేదు అంది. తరవాత నా భార్యను కనుక్కుంటే "ఆ! దాని మొహాన వార్చి కూడ పోస్తా! నాకదేపని!" అన్నది. వేరే వార్చిపొయ్యకుండానే

మిగులుతుంది కదా అన్నాను. పనిమనిషికి అన్నం పెట్టే ఏర్పాటు చేసుకున్నప్పటినించీ ఇద్దరు మనుషుల అన్నం మిగులుతున్నదనీ, అదెందుకంటే ఒకవేళ మిగలకపోతే పనిమనిషి ఊరుకోదు. గనక యీ పీనిగను రెండున్నరకు మాట్టాడి ఒక మనిషి అన్నమే మిగులుస్తున్నానని చెప్పింది. ఇదంతా ఒకంతట బోధపడే వ్యవహారం కాదు. సరే, పోనీ, నాకెందుకు, పొమ్మని ఊరుకున్నాను.

వాళ్ళ వాళ్ళింట్లో ఏదో బారసాల - కాబోలు - అయితే నా భార్య ఒక్క రోజంటే ఒక్కరోజు శలవు తీసుకుంది. ఆ కిందటిరోజే పనిదానితో మర్నాడు రావద్దని చెప్పి మరీ వెళ్ళింది మా ఆవిడ.

పని ముండ యథాప్రకారం హాజరైంది.

"ఏమే, అమ్మగారు రావద్దంటే వచ్చావు?" అన్నాను.

"అమ్మగారంటే అంది లెండి. ఊడ్చి ముగ్గెట్టకపోతే దొడ్డీ వాకిలి బాగుంటుందా?" సరే ఏడుచుకోమని మనసులో అనుకుంటుండగా పనిమనిషి ఒక్కసారి పమిటితీసి దులిపి మళ్ళీ వేసుకుని ఛాతీ ప్రదర్శనం చేసి వెళ్ళి తలవాకిటి తలుపు గడియపెట్టి దొడ్డి చిమ్మటం మొదలుపెట్టింది. నేను దిగ్భ్రమ చెంది నుంచున్నచోటే పాతుకుపోయినాను. మరి నేను శుకుడినా, పరాశరుడినా వాళ్ళంతా వెలగబెట్టింది ఏముంది?

చిమ్మినట్టే చిమ్ముతూ మధ్య మధ్య నా వైపు చూసి నవ్వటం మొదలుపెట్టింది. తెగించి "ఒకసారి లోపలికి రావే!" అన్నాను.

"దేనికి?" అంది.

"పనుంది"

"మీ పని నాకు తెలుసులే." అంటూ చీపిరికట్ట అక్కడ పారేసి నావైపు వచ్చింది.

దాం దుంపతెగ! దాని వంటి బిగువు! దానిశక్తి! తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది!...

ఆడవాళ్ళకు షష్టేంద్రియం ఉంటుంది. నా భార్య వస్తూనే.

"నిన్న వచ్చిందా అది?"

"ఆఁ"

"అయితే ముగ్గు వెయ్యలేదేం?... ఏం చేశారు దాన్ని?"

"మాయమయిందా యేం?"

నా భార్య ఏడవటం మొదలుపెట్టింది. నేను చాలాసేపు ఓదార్చిన మీదట కాస్త తేలి "ఆ పక్షిని రావద్దని చెప్పండి!" అంది.

"నువ్వే చెప్పు."

"మీరే చెప్పండి. మీ రెరుగుదురుగా దాన్ని!"

"పోనీ నేనే చెబుతాను. చూడూ! నువ్వు చూడు పని లేక ఎట్లాలావెక్కి పోతున్నావో! ఈ పనిముండలెందుకు? అనుమానాలు ఎందుకు?"

నా భార్య నిజమే నన్నది, నేను నిర్దోషినని నమ్మిందనుకున్నాను.

ఆ రాత్రి అకస్మాత్తుగా "దాన్ని కూడా ముద్దు పెట్టుకున్నారా?" అని నా ప్రాణం పొయ్యేటట్టు చేసింది!

***మొదటి ముద్రణ : వినోదిని, సెప్టెంబర్ 1935***